క్లుప్తంగా

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


విద్యార్థినుల నృత్య ప్రదర్శన

సంతకవిటి: మండలంలోని మందరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శనివారం సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు హెచ్ఎం దాసరి కృష్ణారావు మాట్లాడుతూ, విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అదపాక దామోధరరావు, గౌరునాయుడు, గడే అప్పల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం సందర్శన


కుట్టుమిషన్ శిక్షణ కేంద్రంలో ప్రదర్శించిన దుస్తులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి శ్యామ్‌కుమార్

బొబ్బిలి రూరల్: స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహిస్తున్న కుట్టుమిషన్‌శిక్షణ కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి శ్యామ్‌కుమార్ శనివారం సందర్శించారు. అక్కడ శిక్షణ పొందుతున్న మహిళలు కుట్టిన దుస్తులను పరిశీలించి, వారి ప్రతిభను మెచ్చుకున్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్మిస్తున్న ఇంకుడుగుంత, అలజంగి జెడ్పీ ఉన్న పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమం జెడ్పీటీసీ సంకిలి శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి ఆసరా దోహదం

రాజాం సిటీ: మహిళల అభ్యున్నతికి ఆసరా ఎంతో దోహదపడుతుందని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శనివారం ప్రారంభించిన ఆసరా మూడో విడత కార్యక్రమాన్ని మున్సిపల్ కార్యాలయంలో నాయకులు, డ్వాక్రా సంఘాల మహిళలతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో మేనేజర్ నాగరాజు, మెప్మా టీఎంసీ ఎస్‌వీ రత్నం, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, నాయకులు పొట్నూరు లక్ష్మణరావు, గార గున్నంనాయుడు, ఆశపు సూర్యం, దూబ గోపాలం, ఎస్‌హెచ్‌జీ మహిళలు పాల్గొన్నారు.

సక్రమంగా సామాజిక తనిఖీలు

సంతకవిటి: మండలంలో గతేడాదిలో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించిన సామాజిక తనిఖీలు సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి సామాజిక తనిఖీల బృందానికి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందాలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ ఉంటుందన్నారు. రూ.12.84 కోట్ల వేతన అమౌంట్‌తో పాటు రూ.5.99 కోట్ల మెటీరియల్ పనులపై ఆడిట్ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ మధులత, ఏపీఓ త్రినాథరావు, డీఆర్‌పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే పీఏసీఎస్ అభివృద్ధి


మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రరావు

మెంటాడ: సమష్టి కృషితోనే పీఏసీఎస్ అభివృద్ధి సాధ్యమని పీఏసీఎస్ చైర్మన్ తాడ్డి రామచంద్రరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో నిర్వహించిన సాధారణ సమావేశంలో పాల్గొన్న ఆయన ఇప్పటివరకు రూ.3.50 కోట్ల రుణాలను రైతులకు ఇవ్వడమే కాకుండా అందులో 90 శాతం వసూళ్లు కూడా చేయడం జరుగుతోందన్నారు. అలాగే మండలంలో దాదాపు రూ.72 లక్షల వ్యయంతో రెండుచోట్ల రైతుల సరుకులను నిల్వ ఉంచేందుకు గోదాములు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. పీఏసీఎస్ పరిధిలో అర్హులైన వారందరికీ రుణాలు అందజేయడం జరుగుతోందన్నారు. సమావేశంలో సొసైటీ డైరెక్టర్ డి.చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వినియోగించుకోవాలి

రేగిడి: గ్రామాల్లో ప్రభుత్వం చేపడుతున్న ఉపాధి పనులను వేతనదారులు చక్కగా వినియోగించుకోవాలని ఎంపీడీఓ జి. కాశీవిశ్వనాథరావు అన్నారు. మండలంలోని సోమరాజుపేట, అంబకండి, ఉంగరాడ, తదితర గ్రామాల్లో శనివారం జరిగిన గ్రామసభల్లో ఆయన మాట్లాడుతూ, చాలామంది వేతనదారులు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడేవారన్నారు. ప్రభుత్వం గ్రామాల్లోనే అవసరమైన ఉపాధిని కల్పిస్తోందని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమరాజుపేటలో నిర్వహించిన సామాజిక తనిఖీలో గుర్తించిన విషయాలను డీఆర్‌పీ సత్తిబాబు వేతనదారులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సవళాపురపు రమేష్‌నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


తెర్లాం: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ


బొబ్బిలి రూరల్: అలజంగిలో ఆకట్టుకున్న పౌష్టికాహార ప్రదర్శన


వంగర: సంపూర్ణ పక్వాడ్ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది

తెర్లాం: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని ఐసీడీఎస్ పెరుమాళి సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని నెమలాం గ్రామ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ రక్తహీనత బారినపడకుండా ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాల ప్రదర్శన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని అలజంగి గ్రామంలో చేపట్టిన పౌష్టికాహార ప్రదర్శన ఆకట్టుకుంది. ఐసీడీఎస్ రూరల్ పీఓ విజయలక్ష్మి, ఎంపీపీ శంబంగి లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతికుమారి, మండల ప్రత్యేకాధికారి శ్యామ్‌కుమార్, ఎంపీడీఓ అల్లు భాస్కరరావు ఆ ప్రదర్శనను తిలకించి, పౌష్టికాహారం వాడడం వల్ల కలిగే మేలును వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.భద్రమ్మ, పార్టీ నాయకులు పి.లక్షుంనాయుడు, ఆర్.బుజ్జి పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం

వంగర: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వీరఘట్టం ఐసీడీఎస్ పీఓ పూర్ణిమ తెలిపారు. వంగరలో సంపూర్ణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న హయాంలోనే మహిళల అభివృద్ధి


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు, తదితరులు

రేగిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలోనే మహిళలు ఆర్థికంగా ఎదిగారని వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు అన్నారు. మండలంలోని సోమరాజుపేట గ్రామంలో శనివారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద మండలంలోని 1408 సంఘాలకు రూ.10.32 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. 2024లో జరగనున్న ఎన్నికల్లో మరలా జగన్ మోహన్‌రెడ్డిని సీఎంగా ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం టి. మంగమ్మ, ఏఓ జి. మురళీకృష్ణ, సర్పంచ్ సవళాపురపు రమేష్‌నాయుడు, స్వయంశక్తి సంఘాల మహిళలు పాల్గొన్నారు.

బాలికా సంరక్షణకు కృషి చేయాలి


తెర్లాం: మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారిణి దీక్షితారాణి

బొబ్బిలి రూరల్: బాలికా సంరక్షణకు కృషి చేయాలని ఎంపీపీ శంబంగి లక్ష్మి కోరారు. శనివారం మండలంలోని అలజంగి గ్రామంలో నిర్వహించిన సఖి కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఆడపిల్లల హక్కులకు భంగం కలగకుండా ప్రతిఒక్కరూ నడుచుకోవాలని, బాల్యవివాహాలు జరగకుండా, బాలికలు, మహిళలు వేధింపులకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ రూరల్ పీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ బాలికలు, మహిళల సంరక్షణకు చట్టాలు, టోల్ ఫ్రీ నంబర్లు ఉన్నాయని, వాటిని ఆశ్రయించి రక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎస్. శాంతికుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాల నాయుడు, మండల ప్రత్యేకాధికారి శ్యామ్‌కుమార్, ఎంపీడీఓ ఎ.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: స్థానిక వెంకటేశ్వర ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో నిర్వహించిన సఖి కార్యక్రమంలో కిశోరి బాలికలకు గుడ్‌టచ్- బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించారు. బాలికలు, యువతులు, మహిళలు ఎవరైనా ఎటువంటి వేధింపులకు గురైనా పోలీసులను ఆశ్రయించి, న్యాయం పొందవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారిణి దీక్షాతారాణి తెలిపారు. బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎటువంటి అనారోగ్యంతో బాధపడినా పీహెచ్‌సీకి వచ్చి వైద్యపరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ సీహెచ్ఓ భాస్కరరావు సూచించారు. బాలికలు, మహిళలు దిశ, పోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెర్లాం-1, 2 సచివాలయ మహిళా పోలీసులు రమాదేవి, తులసీ తెలిపారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే సీఎం లక్ష్యం

- ఎంపీపీ లావేటి సులోచన


రాజాం: సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

రాజాం: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ లావేటి సులోచన అన్నారు. పెనుబాక రైతుభరోసా కేంద్రం వద్ద శనివారం నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏలూరు జిల్లా దెందులూరులో ప్రారంభించిన ఈ పథకాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా రాజాం మండలంలో 1141 సంఘాలకు సంబంధించి 11,797 మంది సభ్యులకు మొత్తం రూ.3.38 కోట్లు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాల నాయుడు, సర్పంచ్ బండి బోడమ్మ, ఎంపీటీసీ సభ్యుడు బింగి కృష్ణ, ఏసీ చిరంజీవి, ఏపీఎం దధి కుమార్, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడిగా కండాపు


కండాపు ప్రసాదరావు

బొబ్బిలి: ఐఏఎల్(భారత న్యాయవాదుల సంఘం) జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది కండాపు ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శిగా రెడ్డి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. సంఘ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

రైల్వే పోలీస్ కార్యాలయంలో తనిఖీలు


రికార్డులు పరిశీలిస్తున్న విశాఖ రైల్వే లైన్స్ సీఐ వెంకటరావు

బొబ్బిలి రూరల్: స్థానిక రైల్వే పోలీస్ కార్యాలయంలో విశాఖ రైల్వే లైన్స్ సీఐ వెంకటరావు శనివారం తనిఖీలు నిర్వహించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా చేపట్టిన ఈ పరిశీలనలో అక్కడి రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని, అలాగే దొంగతనాల నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

రామభద్రపురం: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన ఈశాన్యేశ్వరాలయ ప్రారంభోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను వీధుల్లో ఊరేగించారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

వంగర: పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈఓ వై.దుర్గారావు అన్నారు. మండల పరిధిలోని యూకే గుమ్మడ ప్రాథమిక పాఠశాలను శనివారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ఆరా తీయడంతో పాటు రికార్డులను పరిశీలించారు. పరిశీలనలో హెచ్ఎం సాలాపు తిరుపతిరావు ఉన్నారు.

ఎన్.ఎమ్.ఎమ్.ఎస్‌కు పలువురి ఎంపిక


ఎన్.ఎమ్.ఎమ్.ఎస్‌కు ఎంపికైన పెంట పాఠశాల విద్యార్థులు

బొబ్బిలి రూరల్: మండలంలోని పలువురు విద్యార్థులు ఎన్.ఎమ్.ఎమ్.ఎస్(నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపికయ్యారు. పెంట గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు కొండేటి శ్యామ్‌కుమార్, గంట మురళి, గేదెల గణేష్‌లతో పాటు పక్కి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఎం.గాయత్రి, కె.లావణ్య ఎంపికైనట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థులను సిబ్బంది అభినందిస్తున్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

రేగిడి: మండల పరిధిలోని వన్నలి గ్రామానికి చెందిన రూపిటి దాలినాయుడు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యురాలు ఆవాల రాజ్యలక్ష్మికి వైఎస్సార్ బీమా కింద రూ. పది వేలు శనివారం అందజేశారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంక్ ఖాతాకు జమవుతుందని సర్పంచ్ గార రమణ, పంచాయతీ కార్యదర్శి గోవిందరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ రవి తెలిపారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

వంగర: మగ్గూరు రక్షిత మంచినీటి పథకం పరిధిలోని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఏపీఎస్ రాజన్ తెలిపారు. మండల పరిధి మద్దువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్ట్‌ను ఆనుకొని మగ్గూరు వద్ద ఉన్న రక్షిత మంచినీటి పథకం హెడ్ భాగాన్ని పరిశీలించారు. వేసవిలో ప్రజలు తాగునీటికి ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏఈ తెలిపారు. కార్యక్రమంలో ఏఈ సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలి

బాడంగి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజనం నిర్వాహకులు, గ్రీన్ అంబాసిడర్లు, ఆశ కార్యకర్తలకు కనీస వేతనాలు ఇవ్వాలని, నిత్యావసరాల ధరలు తగ్గించాలని కోరారు. శనివారం ఇదే విషయమై ఏప్రిల్ 5వ తేదీన జరిగే చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు పాల్గొన్నారు.

ప్రజల జీవన విధానం తెలుసుకోవాలి


మునకలవలసలో మహిళలతో మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

రేగిడి: ప్రజల దైనందిన జీవన విధానాన్ని తెలుసుకోవాలని జీఎంఆర్ ఐటీ ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి డాక్టర్ కేవీఎస్ ప్రసాద్ అన్నారు. మండలంలోని మునకలవలసలో జీఎంఆర్ ఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వారి కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. వారి ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ ఆర్థిక పరిస్థితి, చదువు, ఆరోగ్యం, తదితర వాటిపై ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలపలి చంద్రశేఖరరావు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

జన్నివలసలో పశువైద్య శిబిరం


పశువుల ఆరోగ్యం పరీక్షిస్తున్న మండల పశువైద్యాధికారి నరేంద్రకుమార్

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలో పశువైద్య శిబిరం శనివారం నిర్వహించారు. గర్భకోశ, ఇతర వ్యాధులతో బాధపడుతున్న పశువులను మండల పశువైద్యాధికారి జె.నరేంద్ర కుమార్ పరీక్షించి, అవసరమైన మందులు అందజేశారు. పశువుల కాపర్లు, పశుపోషకులు అనారోగ్యం బారినపడిన పశువుల గురించి సమాచారం ఇవ్వాలంటే 1962 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. పశువుల ఆరోగ్యమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పశువైద్య వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడెల విజయబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


బొబ్బిలి రూరల్: వైఎస్సార్ ఆసరా పథకం లైవ్ ప్రోగ్రాంను తిలకిస్తున్న అధికారులు, మహిళలు

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ ఆసరా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా డీడీ(డిప్యూటీ డైరెక్టర్) పి.రత్నం, తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి కోరారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో వైఎస్సార్ ఆసరా పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో చెప్పిన విధంగా వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా ఎంతోమంది మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ డీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: వైఎస్సార్ ఆసరా పథకంతో మహిళలకు ఎంతో మేలు కలుగుతోందని వెలుగు ఏపీఎం పీపీ స్వామి అన్నారు. మండలంలోని పెంట గ్రామంలో వైఎస్సార్ ఆసరా పథకం ప్రారంభోత్సవ లైవ్ ప్రోగ్రాంను తిలకించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 1352 గ్రూపుల సభ్యులకు రూ.8.2 కోట్లను ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎస్.శాంతికుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎస్. వేణుగోపాలనాయుడు, సర్పంచ్ బి.విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల్లో వైఎస్సార్ ఆసరా పథకం లైవ్ ప్రోగ్రాంను టీవీలో వీక్షించే కార్యక్రమం శనివారం జరిగింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఏప్రిల్ 16 నాటికి బ్యాంకు లింకేజీ ద్వారా డ్వాక్రా సంఘాలు తీసుకున్న అప్పు మొత్తం నాలుగు వాయిదాలలో రుణమాఫీ చేస్తానని ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు రుణమాఫీ చేస్తున్నారని జెడ్పీటీసీ పెద్దింటి రామారావు తెలిపారు. ఏపీఎం భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మండలంలో మొత్తం 949 సంఘాలకు చెందిన 10,629 మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు.

23 మంది గైర్హాజరు

బాడంగి: స్థానిక గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు శనివారం 23 మంది గైర్హాజరైనట్లు ఎగ్జామ్స్ చీఫ్‌లు టి.రామదాసు, వి.శంకరరావు తెలిపారు. వారంతా ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల హాజరుకాలేనట్లు తెలిపారు.